క్లుప్తంగా

నేడు ఉజ్జయినీ మహంకాళి విగ్రహ ప్రతిష్ఠ



నవర గ్రామంలో నిర్మించిన ఉజ్జయినీ మహంకాళి ఆలయం

సామర్లకోట: మండల పరిధిలో నవర గ్రామంలో సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు దమ్మాల లక్ష్మణరావు, వీర నాగమణి దంపతులు ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో బుధవారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. సర్పంచ్ లక్ష్మణరావు విలేకర్లతో మాట్లాడుతూ ఈ మేరకు నవరత్న న్యాసం, నవధాన్యన్యాసం, యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ ఉంటాయన్నారు. వేదపండితుడు వింజమూరి సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సర్పంచ్ సూచించారు.

వాకతిప్పలో ఏకాహం



భజన సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

కొత్తపల్లి: సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వాకతిప్ప శెట్టిబలిజ రామాలయం వద్ద మంగళవారం ఏకాహం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన భజన బృందాల సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా భజన బృందాల సభ్యులు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా ఏకాహం, సప్తాహం నిర్వహించడం వలన ఆ గ్రామంలో మంచి జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లుతారన్నారు. బుధవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మాండవ్య నారాయణునికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న శ్రీ, భూ సమేత మాండవ్యనారాయణస్వామి

సామర్లకోట: స్థానిక పురాతన మాండవ్య నారాయణుని ఆలయంలో ఆయన జన్మ నక్షత్రం శ్రవణం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతా అప్పారావు, లక్ష్మి దంపతులు స్వామి వారికి అమ్మవార్లకు క్షీరాభిషేకం చేయించారు. ఆలయ అర్చకులు పద్మనాభాచార్యులు, రవికుమార్ ఆచార్యులు, రఘురామ్ ఆచార్యులచే విశేష సహస్ర నామార్చనలు చేశారు. ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి, సిబ్బంది పాల్గొని భక్తులకు సేవలందించారు. పూజా కార్యక్రమాలను తిలకించిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

గురుకుల విద్యార్థులకు 27, 28 తేదీల్లో పరీక్షలు

పెద్దాపురం: మహాత్మా జ్యోతిభా పూలే వెనుకబడిన సంక్షేమ తరగతుల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఈ నెల 27, 28 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పెద్దాపురం గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ సీకేపీ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ 27వ తేదీన ఐదో తరగతి, 28వ తేదీన 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

25న ఉప ముఖ్యమంత్రి పర్యటన

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఈ నెల 25న నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొననున్న అభివృద్ధి కార్యక్రమాలకు అనువైన ప్రదేశాలను కలెక్టర్ షణ్మోహన్, పాడా, బీసీ కార్పొరేషన్, పోలీస్, మున్సిపాలిటీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి, ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సీహెచ్ రత్నరాజు, మున్సిపల్ కమిషనర్ కనకారావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి

పెద్దాపురం: కాకినాడ జిల్లా అభివృద్ధికి కృషి చేయనున్నట్టు కుడా చైర్మన్ తుమ్మల బాబు తెలియజేశారు. మంగళవారం పెద్దాపురం, గండేపల్లి మండలాల పరిధిలోని లే అవుట్లు, నాన్ లే అవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాను కొడా నిధుల ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జేసీ రాహుల్ మీనా, కొడా వైస్ చైర్మన్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తదితరులు పాల్గొన్నారు.

రంగు చూసి మోసపోవద్దు

- రసాయన పండు.. రోగాలు మెండు
- మామిడి పండ్ల పక్వం కోసం కార్బైడ్
- పర్యవేక్షణలో అధికారులు విఫలం
- నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 1900 ఎకరాలలో సాగు



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంచేసిన మామిడి పండ్లు

కొత్తపల్లి: నవనవలాడుతూ మంచి రంగు తేలి ఆకర్షణీయంగా కనబడుతూ, ఘుమఘుమలాడుతూ తీయని రసమాధుర్యాన్ని అందించే మామిడి పండంటే ఇష్టపడనివారెవరు? వేసవిలో లభించే మధురఫలం ప్రియుల ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని, కొంత మంది మామిడి వ్యాపారులు హానికర రసాయనాలు వినియోగించి మామిడి పండ్లను బలవంతంగా మాగబెడుతున్నారు. పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, ఆకర్షణీయమైన రంగు వచ్చేందుకు ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని పిచికారీ చేస్తున్నారు. ఇటువంటి మామిడి పండ్లను తినడం వలన క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడి తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు వంటి సమస్యలు వస్తాయి. జ్ఞాపకశక్తి నశిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

సంప్రదాయ, సాంకేతిక పద్ధతులే సురక్షితం

మామిడి పండ్లను మాగబెట్టడంలో సంప్రదాయ, సాంకేతిక పద్ధతులు పాటించడంలో ఎంతో మేలని సూచిస్తున్నారు. రైతులు క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఎగుమతులకు అనువుగా మాగబెడితే మంచి లాభాలు ఆర్జించడమే కాకుండా, ప్రజలకు సురక్షితమైన పండ్లను అందించినట్లవులుందని చెబుతున్నారు. పిఠాపురం నియోజక వర్గం వ్యాప్తంగా సుమారు 1900 ఎకరాల్లో మామిడిని సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు 1744, పిఠాపురం 75, కొత్తపల్లి 89 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎకరాకు 4 నుంచి 6 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

కొరవడిన పర్యవేక్షణ

మామిడి తోటల నుంచి వ్యాపారులు గుత్తగా మామిడికాయలను తీసుకువచ్చి నిషేధిత రసాయలను వాడుతూ పండ్లను మగ్గపెడున్నారు. మార్కెట్లోకి రసాయనాలతో మగ్గబెట్టిన పండ్లు విచ్చలవిడిగా వస్తున్నా ఆహార భద్రతాధికారుల పర్యవేక్షణ మాత్రం కొరవడింది.

కాల్షియం కార్బైడ్ ప్రమాదకరం



మామిడి కాయలపై కాల్షియం కార్బైడ్ పూయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఇలా వాడినట్లయితే ఆహార భద్రత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. ఇటువంటి మామిడి పళ్లు తినడం వలన దీర్ఘకాలిక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. రసాయనాలు పూసిన మామిడి పళ్లు తింటే నాలుక, పెదవులు మొద్దు బారినట్లు అనిపిస్తుంది. ఇలా అనిపిస్తే అటువంటి పళ్లను తినవద్దు. ఆరోగ్యకరమైన మామిడిపళ్ల ఉత్పత్తికి రైతులు, వ్యాపారులు సురక్షిత పద్ధతులు పాటించాలి. కాల్షియం కార్బైడ్‌కు బదులుగా ఇథలిన్ గ్యాస్ చాలా తక్కువ హానికరమైనది. అయితే రైతులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కృత్రిమంగా మగ్గబెట్టిన మామిడి పండ్లనే విక్రయించాలి.

– కె.శైలజ, ఉద్యానశాఖ అధికారి పిఠాపురం నియోజకవర్గం

దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయి



రసాయనాలతో మగ్గబెట్టిన మామిడి పండ్లను తినడం వల్ల దీర్ఘకాలిక రోగాలు వ్యాప్తి చెందుతాయి. రసాయనాల ద్వారా పండించిన మామిడి పండ్లను తీసుకున్న వారికి గ్యాస్ట్రిక్ సమస్యలు, విరేచనాలు, వాంతులే కాకుండా మనిషి పూర్తిగా నీరసించి పోయే ప్రమాదం ఉంది. రంగులు చూసి ప్రజలు మోసపోకుండా ఎవరి వారే కాపాడుకోవాలి.

– సుష్మ, వైద్యాధికారి, కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వీఆర్‌కే చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్‌లోని విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న సేవలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు విద్యా శాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీని, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం శివజ్యోతి, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి జీతాలు

సాక్షి ఇంపాక్ట్

పిఠాపురం: ధాన్యం కొనుగోలు చేసే వారులేరు బాబోయ్ అని రైతులంటుంటే కొనాలంటే మాకు జీతాలివ్వాలి కదా అంటూ ఆందోళన వ్యక్తం చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి ఎట్టకేలకు జీతాలు అందాయి. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది. మూడు నెలలుగా జీతాలు లేక ముప్పుతిప్పలు పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. దీంతో వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది. సార్వా సీజన్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సార్వా సీజన్ పోయి మూడు నెలలు పూర్తయ్యి దాళ్వా సీజన్ వచ్చినా జీతాలు ఇవ్వక పోవడంతో దాళ్వా ధాన్యం ఎలా కొనాలంటు ఆందోళన వ్యక్తం చేశారు. తమ జీతాలు ఇప్పించాలని ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు లేక పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఈ నెల 9వ తేదీన సాక్షి దినపత్రికలో జీతాలు అందక వెతలు అనే శీర్షికన వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. మూడు నెలల జీతాలు బకాయిలు ఉండగా అధికారులు రెండు నెలల జీతాలు ఖాతాల్లో వేసినట్లు సిబ్బంది తెలిపారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు జీతాలు అందేలా చేసిన సాక్షికి వారు కృతజ్ఞతలు తెలిపారు.


జీతాలు అందక వెతలు

ఈనెల 9న 'సాక్షి'లో వెలువడిన కథనం

రెండు నెలల్లో 80 వేల సోలార్ కనెక్షన్లు

- కలెక్టర్ షణ్మోహన్
- పీఎం సూర్యఘర్‌పై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

సామర్లకోట: జిల్లాలో ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు వినియోగించుకునేలా జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, డీఆర్‌డీఏ సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. పీఎం సూర్యఘర్ యోజనపై జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, డీఆర్‌డీఏ సిబ్బందికి స్థానిక టీటీడీసీలో మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా మహిళా సమాఖ్యలోని ప్రతి సభ్యురాలూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని సబ్సిడీ పొందాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలోవాట్ల వరకూ ఉచితంగా అందజేస్తారన్నారు. స్లాబ్, పెంకులు, రేకుల ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. పూరిల్లు అయితే, అక్కడి ఖాళీ స్థలంలో దీనిని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. వర్షాలు ప్రారంభమయ్యే నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రెండు నెలల్లో 80 వేల కనెక్షన్లు పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు. మహిళా సంఘాల్లో స్త్రీ నిధి బ్యాంకు నుంచి రుణ బకాయిలు లేని వారికి సులభంగా రుణం అందుతుందని చెప్పారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా లేని వారికి కూడా బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలివ్వడానికి ముందుకు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్ మాట్లాడుతూ, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు ద్వారా ఆదాయం కూడా పొందవచ్చన్నారు. యూనిట్‌లో 50 శాతం సబ్సిడీ ఇస్తారని, ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లు ఆ పైన రూ.78 వేల చొప్పున సబ్సిడీ లభిస్తుందని వివరించారు. ఒక కిలోవాట్‌కు ఏడాదికి రూ.8 వేలు, రెండు కిలోవాట్లకు రూ.20 వేలు, మూడు కిలోవాట్లకు రూ.32 వేల వరకూ ఆదాయం లభిస్తుందని చెప్పారు. లబ్ధిదారులు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్తును ఏపీఈపీడీఎల్ కొనుగోలు చేసి, ప్రతి నెలా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్, ఏడీఈ కిరణ్, ఏఈ రమేష్ కుమార్, వెలుగు డీపీఎంలు వెంకటేశ్వరరావు, బాబూరావు, జిలానీ, రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో 22 మంది చేరిక



ప్రభుత్వ హైస్కూల్‌లో చేరడానికి అంగీకరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామర్లకోట: పట్టణ పరిధిలోని అగస్థాన లూథరన్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసు కున్న విద్యార్థులు విద్యను కొనసాగించేలా తల్లిదండ్రులల్లో అవగాహన కల్పించి 22 మందిని ఉన్నత పాఠశాలల్లో చేర్పించినట్టు ఎంఈఓ వై శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు 11 మంది బాలికలను, 11 మంది బాలురలను గుర్తించి ప్రభుత్వ హైస్కూల్, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో చేర్పించడానికి అంగీకార పత్రాలు ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వ హైస్కూల్‌లో అలవుతున్న మౌలిక సదుపాయలు, విద్యార్థులకు అమలవుతున్న పథకాలను తల్లిదండ్రులకు వివరించామని ఎంఈఓ తెలిపారు.

రైతు సేవా కేంద్రాలపై అవగాహన అవసరం

- రైస్ మిల్లులకు రోజువారీ పరిమితి తొలగిస్తాం
- జిల్లా పౌర సరఫరాల మేనేజరు దేవులానాయక్



ఉండూరులో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎం దేవులానాయక్

సామర్లకోట: రైతు సేవా కేంద్రాపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజరు ఎం.దేవులానాయక్ అన్నారు. మండల పరిధిలో ఉండూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించాలంటే రైతు సేవా కేంద్రాల ద్వారానే విక్రయించాలని సూచించారు. 75 కిలోల సాధారణ రకానికి రూ.1725, గ్రేడ్–ఎ రకానికి రూ.1740 ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. మిల్లులో ధాన్యం అన్‌లోడ్ అయిన 48 గంటలలో రైతుల బ్యాంకు ఖాతాలలో సొమ్ము జమ అవుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు దళారులు, మధ్యవర్తులపై ఆధారపడి మోస పోవద్దన్నారు. ప్రతి మిల్లుకు రోజు వారి పరిమితి విధించడం వల్ల ధాన్యం విక్రయించడానికి ఆలస్యం అవుతుందని, ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల ఫిర్యాదులపై స్పందించిన డీఎం బుధవారం నుంచే రోజు వారి పరిమితిని తొలగిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఎంవీ సతీష్, శాంతి కమల, వీఏఏ తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటిన రామకృష్ణ

సామర్లకోట: భూమాతను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని జాతీయ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణ అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆదిత్య యూనివర్సిటీ ఏకో క్లబ్, పాఠశాల ఏకో క్లబ్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు ప్లాస్టిక్‌ను పూర్తిగా తరిమేయాలన్నారు. మొక్కలు నాటడం వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ ఫ్యామిలీ డాక్టర్లు జి.ప్రకాష్, ఎ.లక్ష్మీలావణ్య, అధ్యాపకులు కె.మృదులాదేవి, పి.అన్నపూర్ణ, సీహెచ్ హేమలత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైటీసీని పరిశీలించిన కలెక్టర్



వైటీసీ పనితీరును కలెక్టర్‌కు వివరిస్తున్న మేనేజర్ రాజేష్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలోని గిరిజన యువత శిక్షణ కేంద్రాన్ని (వైటీసీ) మంగళవారం జిల్లా కలెక్టరు షణ్మోహన్ సగిలి పరిశీలించారు. సామర్లకోట వచ్చిన ఆయన వైటీసీని పరిశీలించి కేంద్రం ప్రగతిని మేనేజర్ రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ శిక్షణతో పాటు జాబ్ ఓరియంటేషన్ కోర్సులు ఇక్కడ నిర్వహిస్తున్నామని, ఈమేరకు ప్రస్తుతం 140 మంది శిక్షణ పొందుతున్నట్లు ఆయన కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఈటీసీ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు

- రైతులకు అవగాహన కల్పిస్తున్నాం
- జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



పిఠాపురం మండలం కుమారపురంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ


పిఠాపురం: పంటకు కనీస మద్దతు ధరకు అమ్ముకోవడం, రైతు సేవా కేంద్ర ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. ఆయన వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి మంగళవారం మండలంలోని ఎఫ్‌కే పాలెం, కుమారపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో పర్యటించి రైతులతో నేరుగా మాట్లాడి అవగాహన కల్పించారు. జిల్లాలో 409 ధాన్యం సేకరణ కేంద్రాలలో ఈ అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. జేసీ వెంట వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, తహసీల్దార్ కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'బహిష్కరణ' బాధ్యులపై అట్రాసిటీ కేసు పెట్టాలి

పిఠాపురం: మండలం మల్లాంలో దళితులను సంఘ బహిష్కరణకు గురిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. వేదిక ప్రతినిధులు మంగళవారం బాధితులను కలిసి నిజ నిర్ధారణ చేపట్టారు. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్, ప్రధాన కార్యదర్శి నామాడి శ్రీధర్, సామాజిక కార్యకర్త తోట రాంబాబు తదితరులు మాట్లాడారు. ఇటువంటి ఘటనల్లో చట్టపరమైన పద్ధతిలో వ్యవహరించకపోవడం నిందితులను రక్షించడమేనని పేర్కొన్నారు. తక్షణం బాధితులకు నష్ట పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.

తుప్పలు తొలగించండి

అధికారులకు ఎస్పీ ఆదేశం



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: జనసంచారం తక్కువగా ఉండే ప్రదేశాల్లో తక్షణమే తుప్పలు తొలగించాలని పోలీసు అధికారులను ఎస్పీ బిందుమాధవ్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. తుప్పలను తొలగించడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చునన్నారు. వీటిని గుర్తించేందుకు డ్రోన్లను వినియోగించుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

ఓటు హక్కుపై నిరంతర అవగాహన



ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

- డీఆర్వో వెంకటరావు
- రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష

కాకినాడ సిటీ: ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై నిరంతరం అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అవకాశం ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. మంగళవారం జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ముందుగానే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, మార్పులు, చేర్పులు, తొలగింపు, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు వంటి అంశాలపై చర్యలకు భారత ఎన్నికల సంఘం ప్రతిపాదనలు కోరిందన్నారు. ఈ నేపథ్యంలో తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల తరలింపు, నూతన కేంద్రాల ప్రతిపాదన, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18–19 ఏళ్ల యువత ఓటు నమోదు వంటి అంశాలపై సూచనలు, సలహాలు అందించాలని డీఆర్వో రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లను తప్పనిసరిగా నియమించాలన్నారు. జిల్లా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న 1640 పోలింగ్ కేంద్రాల్లో 16,37,638 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 1000–1200 మంది ఓటర్లు 581 పోలింగ్ కేంద్రాల్లోనూ, 1200 పైన ఓటర్లు 283 పోలింగ్ కేంద్రాల్లో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 800–1200 మంది ఓటర్ల ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించనున్నట్టు తెలిపారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైనన్ని వసతుల కల్పనకు చర్యలు తసుకుంటామని డీఆర్వో తెలిపారు. జిల్లాలో 18–19 సంవత్సరాల యువత ఓటు నమోదు శాతాన్ని పెంచేందుకు డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ సమయంలోనే విద్యార్థులతో ఓటు నమోదు ప్రక్రియ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో ఎన్నికల విభాగం డీటీ ఎం జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా, ఆర్.వెంకటేశ్వరరావు, ఎస్.అప్పారావు, బి.జయప్రకాష్, సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.